క్లుప్తంగా

తాగునీటి శుభ్రత లేకుంటే చర్యలు తప్పవు



క్యాన్లను పరిశీలిస్తున్న జడ్జి విష్ణువర్మ

నగరి : తాగునీటి సరఫరాలో శుభ్రత పాటించకుంటే చట్టరీత్యా చర్యలు తప్పవని నగరి జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ విష్ణువర్మ అన్నారు. నగరి పట్టణంలోని పలు వాటర్‌ప్లాంట్లను బుధవారం ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్లాంట్ల వద్ద బాలకార్మికులు ఉన్నారా అని ఆరా తీశారు. వాటర్ క్యాన్లను, నీటి శుద్ధీకరణ యంత్రాలను పరిశీలించారు. శుద్ధీకరణకు వాడే రసాయన పదార్థాలను మోతాదుకు మించి వాడరాదని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో క్యాన్లు అపరిశుభ్రంగా ఉండడాన్ని కనుగొన్న ఆయన శుభ్రమైన క్యాన్లనే వాడాలని హెచ్చరించారు. తొలిసారి గనుక హెచ్చరికలతో వదిలిపెడుతున్నామని మరోమారు పరిశీలనలో పునరావృతమైతే చర్యలు తప్పవన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్న ఎంఈఓ గిరిజ

పాలసముద్రం: మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అంబేద్కర్ జీవిత చరిత్రపై బుధవారం స్థానిక ఎంఆర్సీ భవనంలో ఎంఈఓ గిరిజ వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సీఆర్పీ మునిరాజ్, శరవణన్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాల తనిఖీ



మద్యం బాటిళ్లను పరిశీలిస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణశాస్త్రి

కార్వేటినగరం: ప్రభుత్వ మద్యం దుకాణాలతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చిత్తూరు మద్యం డిపో సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ శాస్త్రి అన్నారు. బుధవారం మండలంలోని వివిధ ప్రభుత్వ మద్యం దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. మద్యం బాటిళ్లను క్షుణ్ణంగా పరిశీలించి మద్యం అమ్మకాల్లో ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. తనిఖీలో ఆయన వెంట సిబ్బంది కుమార్, జాన్సన్, పలువురు మద్యం షాపుల సూపర్‌వైజర్లు ఉన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తున్న మోహన్ కుమార్

పాలసముద్రం: విద్యార్థులు తమ జీవన శైలిని పెంచుకోవాలని తెలిపారు. స్థానిక జూనియర్ కళాశాలలో బుధవారం ప్రిన్సిపల్ ధనంజయ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం..జీవన ప్రగతి మార్గదర్శకాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఈటీయుఈఎస్ యువజన సేవ నిర్వాహకుడు మోహన్ కుమార్ మాట్లాడుతూ, నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకుపోవాలన్నారు. తిరుపతి కళాశాల ఇంఫాక్ట్, ట్రైనర్ చారిటబుట్ ట్రస్ట్ తామ్‌సిన్ బేగం మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు, షణ్ముగం, బాలక్రిష్ణ, సూర్యన్, రమ్య, సుశీల, భారతి, శోభారాణి, దొరబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న సరీ్వస్ పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు, ఇతర పెన్షనర్లు ఫిబ్రవరి 29వ తేదీలోపు లైఫ్ సర్టిఫికెట్లను కచ్చితంగా అందజేయాలని జిల్లా ట్రెజరీ శాఖ డీడీ రామచంద్ర తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి గాను లైఫ్ సర్టిఫికెట్లు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. పెన్షనర్లు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో లైఫ్ సర్టిఫికెట్లను నేరుగా వచ్చి అందజేయాలన్నారు. 2023–24 సంవత్సరానికి ఇన్‌కంట్యాక్స్ రికవరీకి సేవింగ్స్ ఫారాలు, ఎంత తగ్గింపు చేయాలనే విషయాలను ఆయా సబ్‌ట్రెజరీల్లో తెలియాలని డీడీ రామచంద్ర వెల్లడించారు.

ఆపస్ డైరీ ఆవిష్కరణ

చిత్తూరు కలెక్టరేట్: ఆపస్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) ముద్రించిన నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్లను విద్యాశాఖ మంత్రి బొత్ససత్యనారాయణ ఆవిష్కరించారని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ బుధవారం విజయవాడలో మంత్రి బొత్స చేతుల మీదుగా డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించినట్లు మీడియాకు వివరించారు.

ఉత్సాహభరితంగా ఆడుదాం ఆంధ్రా

వెదురుకుప్పం: క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ అన్నారు. బుధవారం వెదురుకుప్పంలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించి ఆయనతో పాటు సర్పంచ్ శిల్ప మాట్లాడారు. క్రీడా స్ఫూర్తితో యువత రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్, ఏపీఓ ఇందు, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు రామయ్య, జేసీఎస్ కన్వీనర్ బట్టే సుబ్రమణ్యం, నాయకులు విజయశేఖర్‌రెడ్డి, పురంధర్‌రెడ్డి, పెద్దిరెడ్డి, డీడీఓలు వెంకటేశ్, కేశవులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి వాలీబాల్, ఖోఖో క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంపీడీఓ రామనాథరెడ్డి, తహసీల్దార్ బాబు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహించాలన్నదే ఈ పోటీల ఉద్దేశమన్నారు. వాలీబాల్ పోటీల్లో నియోజకర్గం స్థాయికి పాలసముద్రం సచివాలయం జట్టు ఎంపికైంది. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

గ్రామీణులను ప్రోత్సహించడానికే..

కార్వేటినగరం: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తోందని ఎంపీపీ లత అన్నారు. బుధవారం స్థానిక ఆర్కే ఎస్సార్ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మండల స్థాయి క్రీడలను సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో ప్రారంభించి ఎంపీపీ, ఎంపీడీఓ మోహనమురళి మాట్లాడారు.విజేతలకు నగదు బహుమతులు ఇస్తామన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. మొత్తం 14జట్లు హాజరయ్యాయి. ఈఓ పీఎస్ మణి, వ్యాయామోపాధ్యాయులు మురళీకృష్ణరాజు, తిరుమలరాజు, మాండవ్య, డిజిటల్ అసిస్టెంట్లు రోజా, లీనా, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

క్రీడల్లో గెలుపొందిన జట్లను పార్టీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి అభినందించారు. వాలీబాల్ పోటీలో కలికిరి జట్టు విజేతగా నిలవడంతో నియోజకవర్గ స్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆయన అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి కారేటి సురేష్‌రెడ్డి, ఎంపీడీఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి, కార్యదర్శులు లావణ్య, శేషుకుమార్ ప్రభుకిరణ్, మనోరంజని, క్రీడాభిమానులు పాల్గొన్నారు.



గంగాధరనెల్లూరు : కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



పుత్తూరులో పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ హరి

గంగాధరనెల్లూరులో..

గంగాధర్ నెల్లూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఎంపీపీ అనిత ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ అనిత మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారులు తమ ప్రతిభాపాటవాలను చాటుకునేందుకు దీనినో వేదికగా చేసుకోవాలని ఆమె సూచించారు. సర్పంచ్ వీసీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, మండలంలోని 25 సచివాలయ పరిధిలో 25 జట్లకు వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వైస్ ఎంపీపీ హరిబాబు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్, ఎంఈఓలు గుణశేఖర్ రెడ్డి, ఆంజనేయులు శెట్టి, ఎంపీటీసీ మగ్గైదాస్, పార్టీ సీనియర్ నాయకులు గోవిందరెడ్డి, వెంకటేష్‌రెడ్డి, పీఈటీ సెల్వ పాండియన్, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ వేలు మొదలియార్, క్రీడాకారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

పుత్తూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో, గేట్‌పుత్తూరులోని జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్స్‌లో జరిగిన పోటీలను మున్సిపల్ చైర్మన్ ఏ.హరి ప్రారంభించారు. క్రికెట్ పోటీల్లో పట్టణ పరిధిలో మూడు, రూరల్ పరిధిలో మూడు మ్యాచ్‌లు నిర్వహించారు. సత్యనారాయణ కాలనీ జట్టుపై అంబేద్కర్ సర్కిల్, కల్యాణపురం జట్టుపై ఆర్టీసీ కాలనీ జట్టు, గోవిందపాళ్యం జట్టుపై దాసరిగుంట జట్టు విజయం సాధించింది. వాలీబాల్ పోటీల్లో ఆర్టీసీ కాలనీ జట్టుపై లక్ష్మీనగర్ జట్టు విజయం సాధించింది. బ్యాడ్మింటన్‌లో ఎన్టీఆర్ కాలనీ జట్టుపై ఆర్టీసీ కాలనీ జట్టు విజయం సాధించింది. పోటీలను మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి, వైస్ చైర్మన్ జయప్రకాష్, లలిత్ పర్యవేక్షించారు.

అప్పలాయగుంటలో..

వడమాలపేట: మండలంలోని అప్పలాయగుంట క్రీడా మైదానంలో, వడమాలపేట జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో, సాయి శ్రీనివాస పాఠశాల మైదానంలో ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీలను ఎస్ఐ రామాంజనేయులు ప్రారంభించారు. క్రికెట్ పోటీల్లో ఎస్బీఆర్‌పురం, వడమాల, బాలినాయుడకండ్రిగ, అప్పలాయగుంట జట్లు సెమీ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. బ్యాడ్మింటన్ పోటీల్లో ఎస్బీఆర్ పురం, వడమాల, ఎస్వీపురం, వడమాలపేట జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాయి. పోటీలను ఎంపీడీఓ భానుమూర్తి, పీడీ చంద్రశేఖర్‌రాజు, జేసీఎస్ కన్వీనర్ సురేష్‌రాజు పర్యవేక్షించారు.

క్రీడాపోటీలు ప్రారంభం

నింద్ర: మండల స్థాయిలో నిర్వహించే ఆడుదాం–ఆంధ్రా క్రీడలు బుధవారం మండల కేంద్రంలో ఎంపీపీ దీప క్రీడాపోటీలు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న క్రీడల్లో పాల్గొని రాణించాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సతీష్ కుమార్, ఎంపీడీవో అరుణ, ఆర్‌బీకే చైర్మన్ వీరయ్య, వైస్‌ఎంపీపీ శుభా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





వెదురుకుప్పం: మండల స్థాయి పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు, పాలసముద్రం : నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఎంపీడీఓ రామనాథరెడ్డి



వడమాలపేట: క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ రామాంజనేయులు,



నింద్ర: క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ దీప



కార్వేటినగరం: వాలీబాల్ విజేతలతో వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు

మత్స్యకారులను ఆదుకోవడమే లక్ష్యం

- క్రిష్ణాపురం జలాశయంలో 12వేల చేప పిల్లలు వదిలిన ఎంపీపీ లత



కృష్ణాపురం జలాశయంలో చేప పిల్లలను వదులుతున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: మత్స్యకారులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ లత అన్నారు. బుధవారం మండలంలోని కృష్ణాపురం జలాశయంలో 12వేల చేప పిల్లలను వదిలి ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మత్స్యకారుల అభ్యున్నతి కోసం ఆక్వా రంగానికి ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అలాగే కృష్ణాపురం జలాశయం అభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ఎనలేని కృషి చేస్తున్నారని, ఇప్పటికే ఆయన చొరవతో జలాశయం నుంచి నీళ్లను రైతులకు అందించేందుకు సప్లై చానళ్లను మరమ్మతులు చేస్తున్నట్టు చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో కృష్ణాపురం జలాశయం అభివృద్ధి నోచుకోలేదని, అప్పట్లో ఆక్వారంగాన్ని చంద్రబాబు పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు.అనంతరం జలాశయం కుడి, ఎడమ కాలువలను సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, ఎఫ్‌డీఓ రామోహన్ రావు, కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వరసిద్ధునికి రూ.లక్ష విరాళం

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నిత్యఅన్నదానానికి రూ.లక్ష విరాళాన్ని తిరుపతికి చెందిన సుబ్రమణ్యం నాయుడు ఆలయ అధికారులకు అందించారు. ఆయన కుటుంబ సమేతంగా బుధవారం ఉదయం స్వామివారి దర్శనార్థం విచ్చేసి ఆలయ అధికారులకు స్వామివారి నిత్యఅన్నదానానికి విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు ఉన్నారు.

చిత్తపారలో ఏడు నాటు తుపాకుల స్వాధీనం

గుడిపాల: మండలంలోని చిత్తపార అటవీప్రాంతంలో ఏడు నాటు తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ బుధవారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. చిత్తపార అటవీప్రాంతంలో సారా తయారు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అటవీప్రాంతంలో పోలీసులు కూంబింగ్ నిర్వహించగా ఏడు నాటు తుపాకులు దొరికాయని ఎస్ఐ తెలిపారు.

నగరంలో పారిశుధ్య పనుల పర్యవేక్షణ



చిత్తూరు నగరంలో పారిశుధ్య పనులు చేస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరంలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు ప్రజలు సహకరించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని నగర కమిషనర్ అరుణ పిలుపునిచ్చారు. మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె నేపథ్యంలో కమిషనర్ బుధవారం ఉదయం నగరంలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. ప్రధాన రహదారులు, కూడళ్లను పరిశీలించి పారిశుధ్య పనుల నిర్వహణపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. కార్మికుల సమ్మె నేపథ్యంలో నిర్దేశించుకున్న ప్రత్యామ్నాయ ప్రణాళిక ప్రకారం అన్ని వార్డుల్లో పారిశుధ్య పనులు మెరుగ్గా చేపట్టాలన్నారు. కమిషనర్ 38వ వార్డు పరిధిలో ఏఎస్ఎం వీధిలో స్థానిక కార్పొరేటర్ ఉన్ని కృష్ణన్‌తో కలిసి పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. కాలువల్లో పూడిక తీశారు. చీపురు చేతపట్టి విధులను శుభ్రం చేశారు. కార్మికుల సమ్మె నేపథ్యంలో నగరంలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు డ్వాక్రా మహిళలు, యువత, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కమిషనర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య, మేస్త్రీలు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన



పుత్తూరులో ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన

పుత్తూరు: ఎల్ఐసీ ఉద్యోగులు బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఎస్.లక్ష్మణకుమార్ మాట్లాడుతూ వేతన సవరణ గడువు ముగిసి 18 నెలలు కావస్తున్నా యాజమాన్యం కనీసం చర్చలకు సైతం పిలవకపోవడం దారుణమన్నారు. అన్ని తరగతుల ఉద్యోగుల నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్‌పీఎస్ కాంట్రిబ్యూషన్‌ను 10 శాతం నుంచి 14 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారుల సంఘ కార్యదర్శి గంగులయ్య, ఎస్ఎఫ్ఐఎఫ్‌డబ్ల్యూఐ కార్యదర్శి రమేష్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ అజయ్‌బాబు, యూనియన్ అధ్యక్షుడు దస్తగిరి, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం

కార్వేటినగరం: రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని సుబ్రమణ్యంస్వామి ఆలయ అధ్యక్షుడు కేశవరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కత్తెరపల్లెలో మండల కన్వీనర్ శేఖర్‌రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ నేతలు వేసే ఎత్తులను ప్రజల్లో సమర్థవంతంగా తిప్పికొట్టేలా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ముందుకుపోవాలన్నారు. మండల కన్వీనర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ కలసి పని చేసి పార్టీ ఘన విజయానికి కృషి చేయాలని, అలాగే సంక్షేమ పథకాలను ప్రజలకు మరోసారి విస్తృతంగా చాటిచెప్పాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, మాజీ ఏఎంసీ మాజీ చైర్మన్ కృష్ణయాదవ్, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, చందురాజు, అర్జునయ్య, ప్రభాకర్ రెడ్డి, జేమ్స్, మాణిక్యాలరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో నడిపిద్దాం

చిత్తూరు కార్పొరేషన్: ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో జిల్లాను ప్రగతి పథంలో నడిపిద్దామని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ తరగతుల సమావేశంలో మా ట్లాడారు. పల్లెలను అభివృద్ధి పథంలో తీసుకురావాలన్నారు. గ్రామ సభల నిర్వహణ తేదీని ప్రజలకు దండోరా ద్వారా తెలియజేయాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పెండింగ్ బిల్లులు చెల్లించాలని డీపీఓ లక్ష్మి తెలిపారు.

పేదల ఆరోగ్యం కోసమే సురక్ష

చిత్తూరు అర్బన్: పేదల ఆరోగ్య సంరక్షణ కోసమే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నగర మేయర్ ఎస్ అముద, డీఎంహెచ్ఓ ప్రభావతి దేవి అన్నారు. నగరపాలక పరిధిలో బుధవారం 12, 43 వార్డు సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్య శిబిరాలు విజయవంతంగా నిర్వహించారు. 43వ వార్డులో జరిగిన వైద్య శిబిరాన్ని మేయర్ అముద పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించి రోగులకు జగనన్న కిట్లను, మందులను పంపిణీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రభావతితో కలిసి ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. 12వ సచివాలయంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నేడు ఫొటో ఎగ్జిబిషన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 11వ తేదీన బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించన్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం (జన్‌భాగీదారి) కార్యక్రమంలో భాగంగా ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మొదట గురువారం ఉదయం 8.30 గంటలకు జిల్లా కేంద్రంలోని దర్గా సర్కిల్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకు ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం



నింద్ర చెరువులో చేప పిల్లలు వదులుతున్న ఎంపీపీ

నింద్ర: మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమమే వైఎస్సార్ కాంగ్రెస్ లక్ష్యమని ఎంపీపీ దీప అన్నారు. మండల కేంద్రంలోని పెద్ద చెరువులో చేపలను చెరువులో వదిలే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మట్లాడుతూ మత్స్యకారుల కోసం ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలు పంపిణీ, ఆర్థిక సాయం అందించడం వంటి సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు చెప్పారు. మత్స్యసహకార సంఘం పరిధిలో ఉన్న చెరువులకు ఉచితంగా 42 వేల చేప పిల్లలను చెరువులో వదిలిపెట్టారు. ఈ కార్యక్రమంలో మత్స్య అభివృద్ధి అధికారి రామ్ కుమార్, గ్రామ మత్స్యఅధికారి మైఖేల్, సంఘం చెర్మన్ శివలింగారెడ్డి, సభ్యులు జయరాం రెడ్డి, వీఆర్వో రుక్మిణీ, కార్యదర్శి ధరణి, నాయకులు శివయ్య, జలంధర్ రాజు, చంద్రబాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



అందంగా వేసిన రంగవల్లుల ముందు విద్యార్థినులు, అధ్యాపక బృందం

కార్వేటినగరం: స్థానిక శ్రీలక్ష్మీనరసింహ కళాశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను కోలాహలంగా నిర్వహించారు.విద్యార్థినులు కళాశాల ఆవరణాన్ని రంగవల్లులతో సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే వంటకాలు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ దిలీప్‌కుమార్ అధ్యాపకులకు, ఛాత్రోపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి భోగిమంటలు వేశారు. ఆ మంటల చుట్టూ వలయంగా తిరుగుతూ గొబ్బిపాటలు పాడారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో డైరెక్టర్లు ధనంజయరెడ్డి, పురుషోత్తం,వెంకటేశ్వర్లు, కిషోర్,మహేశ్వర్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.